

శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

కుంభకోణంలో

కరుణ పేరిట విశ్వవిద్యాలయం

● అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి పేరుతో కుంభకోణంలో ఓ విశ్వవిద్యాలయం నెలకొల్పనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఉదయం శాసనసభలో ప్రకటన చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సభ్యుడు కె.సెల్వపెరుంతగై, పీఎంకే సభ్యుడు జీకే మణి, చింతనై సెల్వన్, వీపీ నాగైమాలి, రామచంద్రన్, డాక్టర్ సదన్ తిరుమలైకుమార్, ఎంహెచ్ జవాహిరుల్లా, ఆర్.ఈశ్వరన్, వేల్‌మురుగన్ తదితర శాసనసభ్యులే కాకుండా స్పీకర్ అప్పావు కూడా సభా నిబంధన 55 ప్రకారం రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు అవిరళ కృషి చేసిన కరుణానిధి పేరుతో విశ్వవిద్యాలయం లేకపోవడం శోచనీయమన్నారని, ఎంజీఆర్, జయలలిత పేర్లతో విశ్వవిద్యాలయాలున్నాయని, ఆ కోవలోనే కరుణానిధి పేరుతో ఓ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని పట్టుబట్టడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయిలో ఎదిగిన విద్యాలయాలన్నీ కరుణానిధి హయాంలో ఏర్పాటైనవేనని చెప్పారు. సభ్యుల కోరిక ప్రకారం కరుణానిధి జన్మించిన ఉమ్మడి తంజావూరు జిల్లాలోని కుంభకోణంలో 'కలైంజర్' పేరుతో కొత్త విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని స్టాలిన్ సభ్యుల హర్షధ్వానాల నుడమ ప్రకటించారు. స్టాలిన్ చేసిన ప్రకటనకు సెల్వపెరుంతగై, జీకేమణి తదితర శాసనసభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

రూ.40 కోట్లతో షెనాయ్‌నగర్‌లో యూపీఎస్సీ శిక్షణా కేంద్రం...

యూపీఎస్సీ పరీక్షలపై శిక్షణ ఇచ్చేందుకు షెనాయ్‌నగర్‌లో రూ.40 కోట్లతో సుమారు 500 మంది విద్యార్థులు బసచేస్తూ చదివేలా ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. రాష్ట్రం నుంచి అత్యధిక సంఖ్యలో ఐఏఎస్ అధికారులను తయారుచేసేలా తమ ప్రభుత్వం నాన్ ముదల్వన్ పథకం ద్వారా యూపీఎస్సీ పరీక్షలపై శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని స్టాలిన్ అన్నారు. శాసనసభలో ఎ.వెట్రి అళగన్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ రాష్ట్రంలో యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న వెయ్యిమంది విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ప్రతి నెలా రూ.7500లచొప్పున పది నెలలకు ఉపకార వేతనం అందించామని, ప్రిలిమనరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారికి రూ.25వేల ప్రోత్సాహక నగదు అందించామని చెప్పారు. అన్నా మేనేజ్‌మెంట్ స్టాఫ్ కాలేజీలోని 'యూపీఎస్సీ సెలక్షన్ సెంటర్' ద్వారా ఈ విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించామన్నారు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ కారణంగా యూపీఎస్సీ పరీక్షల్లో ఈ యేడాది రాష్ట్రం నుండి 57 మంది ఎంపిక కావటం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. వీరిలో 50 మంది 'నాన్ ముదల్వన్' పథకం కింద ఎంపికైనవారే ఉన్నారని చెప్పారు. ఈ యేడాది యూపీఎస్సీ విజేతలకు శనివారం రాజాఅన్నామలైపురంలోని అన్నా మేనేజ్‌మెంట్ స్టాఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే సభలో సత్కరించనున్నట్లు తెలిపారు.

ఏం చేద్దాం?

● న్యాయనిపుణులతో మంత్రి మంతనాలు



మంత్రి సెంథిల్ బాలాజీ

ప్యారీస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి పదవి కావాలా, బెయిల్ కావాలో నిర్ణయించుకోవాలంటూ సుప్రీంకోర్టు గడువు విధించడంతో రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీ న్యాయనిపుణులతో చర్చిస్తున్నారు. 2011-2015 వరకు అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రవాణా శాఖా మంత్రిగా వ్యవహరించిన సెంథిల్ బాలాజీ, తన శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి, పెద్దమొత్తంలో నగదు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించి ఆయనపై 2018వ సంవత్సరం మూడు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో సెంథిల్ బాలాజీ అన్నాడీఎంకే నుంచి వైదొలగి డీఎంకేలో చేరారు. 2021లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో డీఎంకే తరుఫున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి అయ్యారు. ఇదిలా ఉండగా మనీ ల్యాండరింగ్ కేసుకు సంబంధించి ఈడీ అధికారులు ఆయనను 2023 జూన్ 14న అరెస్టు చేశారు. బెయిల్ కోరుతూ సెంథిల్ బాలాజీ తరుఫున దాఖలైన పిటిషన్‌ను పలుమార్లు న్యాయమూర్తి నిరాకరించారు. దీంతో 2024 ఫిబ్రవరి 13న మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత సెంథిల్ బాలాజీకి సెప్టెంబర్ 23న బెయిల్ మంజూరైంది. వెంటనే ఆయన తిరిగి మంత్రి వర్గంలో చేరారు. దీంతో ఆయన రాష్ట్రమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈడీ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో ఈడీ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు మంత్రి సెంథిల్ బాలాజీ తరుఫు న్యాయవాదినుద్దేశించి మంత్రి పదవి కావాలా? లేదా బెయిల్ కావాలా? అని సూటిగా ప్రశ్నించి దీనిపై ఈ నెల 28వ తేదీ వరకు గడువు విధించింది. దీంతో మంత్రి సెంథిల్ బాలాజీ, న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లు తెలిసింది. మంత్రి పదవి నుండి వైదొలగడమే ఉత్తమమని భావించిన ఆయన ఆ పదవికి రాజీనామా చేసే అంశం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మంత్రి దురై మురుగన్‌కు షాకిచ్చిన హైకోర్టు

● అవినీతి కేసు విచారణకు ఆదేశం
● 6 నెలల్లో పూర్తి చేయాలని గడువు



మంత్రి దురైమురుగన్

అడయార్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డీఎంకే సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి దురై మురుగన్‌కు మద్రాస్ హైకోర్టు గట్టి షాకిచ్చింది. ఆయనపై నమోదైన మరో అవినీతి కేసును రోజూ విచారించి, ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. 1996-2001 వరకు మంత్రిగా ఉన్న సమయంలో దురైమురుగన్ ఆదాయానికి ఆస్తులు సంపాదించారంటూ ఆయనపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన వేలూరు కోర్టు... దురైమురుగన్‌కు విముక్తి కల్పించింది. ఈ తీర్పుపై ఏసీబీ అధికారులు హైకోర్టులో అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి వేల్ మురుగన్.. మంత్రి దురైమురుగన్‌పై నమోదైన కేసును మళ్ళీ విచారించాలని ఆదేశిస్తూ, గతంలో వేలూరు కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ బుధవారం తీర్పునిచ్చిన విషయం తెల్సిందే. ఇదిలావుంటే మరో ఆదాయానికి మించిన కేసు విచారణ కూడా ఆరు నెలల్లో పూర్తి చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. 2006-2011 మధ్య డీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రజాపనుల శాఖామంత్రిగా వ్యవహరించిన దురైమురుగన్... 2007-09 మధ్య కాలంలో ఆదాయానికి మించి రూ.1.40 కోట్ల విలువ చేసే ఆస్తులను పోగు చేశారంటూ 2011లో ఏసీబీ అధికారులు మంత్రి దురైమురుగన్‌తో పాటు ఆయన భార్యపై కేసు నమోదు చేశారు. ఈ కేసును మొదట విచారించిన వేలూరు కోర్టు.. వీరిద్దరికీ 2017లో విముక్తి కల్పించింది. ఈ తీర్పుపై కూడా ఏసీబీ అధికారులు హైకోర్టులో రివ్యూ పిటిషన్ వేయగా, దీనిపై న్యాయమూర్తి వేల్‌మురుగన్ విచారించారు. ఆ సమయలో దురైమురుగన్, ఆయన భార్య తరపున హాజరైన న్యాయవాదులు తమతమ వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి అవినీతి కేసులో దురైమురుగన్‌తో పాటు ఆయన భార్యకు విముక్తి కల్పిస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ఈ కేసు విచారణ రోజువారీగా చేపట్టి ఆరు నెలల్లో పూర్తి చేయాలని వేలూరు ప్రత్యేక కోర్టును జస్టిస్ వేల్ మురుగన్ ఆదేశించారు.

కశ్మీర్ నుంచి తిరిగొచ్చిన పర్యాటకులు

● ముందుగా చేరుకున్న వందమంది



కశ్మీర్ పర్యటన అర్ధాంతరంగా ముగించుకుని ఢిల్లీ నుంచి తిరిగొచ్చిన ప్రయాణికులు

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల దాడిలో 26 మంది మృతి చెందటంతో రాష్ట్రం నుండి విహారయాత్రగా వెళ్ళిన 140 మంది తమిళ పర్యాటకుల్లో వంద మందిని రాష్ట్ర ప్రభుత్వం స్వస్థలానికి చేర్చే ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టింది. కశ్మీర్ నుండి వీరిని ఢిల్లీలోని తమిళనాడు హౌస్‌లోని సహాయ కేంద్రానికి తరలించారు. వీరందరినీ స్వస్థలాలకు చేర్చేందుకు ఐఏఎస్ అధికారి అల్తాఫ్ రసూల్‌ను పర్యవేక్షణ అధికారిగా ముఖ్యమంత్రి స్టాలిన్ నియమించిన విషయం విదితమే. ఆ అధికారి స్వస్థలం కశ్మీర్ కనుక ఆ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న తమిళ పర్యాటకులను ఎప్పటికప్పుడు గుర్తించి తమిళనాడు హౌస్‌కు ప్రత్యేక బస్సుల్లో తరలించారు. ఇక తమిళనాడు హౌస్‌లో వీరికి డీఎంకే ఎంపి. తిరుచ్చి శివ, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయన్, కమిషనర్ ఆశిష్‌కుమార్ భోజనాలు, బస సదుపాయం కల్పించారు. ఆ తర్వాత బుధవారం రాత్రి 9 గంటలకు 35 మంది తమిళ పర్యాటకులను తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కించారు. వీరందరూ శుక్రవారం ఉదయం నగరానికి చేరుకుంటారు. ఇదే విధంగా ఢిల్లీ నుండి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహాయ చర్యల ద్వారా హైదరాబాద్ మీదుగా విమానంలో గురువారం వేకువజాము 2.30 గంటలకు 19 మంది నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద వీరి బంధువులంతా స్వాగతం పలికారు. 19 మందిలో 14 మంది మదురైకి చెందిన వారు. తక్కిన నలుగురు నగరానికి చెందినవారు. మదురైకి చెందనవారిని ప్రత్యేక బస్సుల్లో అధికారులు ఎక్కించి అందరికీ వీడ్కోలు పలికారు. గురువారం ఉదయం కశ్మీర్, ఢిల్లీ నుండి విమానం, రైలు ద్వారా 50 మంది నగరానికి చేరుకున్నారు. వీరందరిని ప్రత్యేక వాహనాల్లో అధికారులు స్వస్థలాలకు చేర్చారు.

ఆ ప్రాంతానికి ఆలస్యంగా వెళ్లాం... లేకుంటేనా..!

కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు కాల్పులు జరిగిన ప్రాంతానికి 3 గంటలు ఆలస్యంగా వెళ్ళామని, కనుకనే తామంతా గండం నుండి బయటపడ్డామని నగరానికి తిరిగొచ్చిన పర్యాటకులు తెలిపారు. మదురై రాజాజీ ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆనంది విమానాశ్రయంలో మాట్లాడుతూ తమిళనాడు ఆటోమొబైల్ అసోసియేషన్ తరఫున ఈ నెల 19న 70 మంది బృందం కశ్మీర్ పర్యటనకు వెళ్ళామని తెలిపారు. రెండు రోజులపాటు జమ్మూ- కశ్మీర్‌లో ప్రాంతాలను సందర్శించామని, ఆ ప్రాంతాల్లో అక్కడక్కడా సైనికులు కాపలా ఉన్నారని తెలిపారు. మూడోరోజు మినీ స్విట్జర్లాండ్‌గా పేరుగాంచిన పహల్గాం బైసరన్ లోయకు బయలుదేరామని, మార్గమధ్యంలో అందరూ షాపింగ్‌కు వెళ్లటంతో మూడు గంటలు ఆలస్యంగా ఆ ప్రాంతానికి చేరామని, అప్పటికే ఆ ప్రాంతంలో ఈ ఘోరం జరిగిపోయిందని, ఆ ఉద్రిక్త పరిస్థితులలో కశ్మీర్ ప్రజలు, సైనికులు, పోలీసులు తమను వివిధ వాహనాల్లో ఎక్కించి అక్కడి నుండి తరలించారని తెలిపారు. మదురై, చెన్నైకి చెందిన 19 మంది పర్యటన అర్ధాంతరంగా ముగించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యల కారణంగా సురక్షితంగా ఢిల్లీకి చేరుకుని, అక్కడి నుండి విమనంలో బయలుదేరి నగరానికి చేరుకున్నామని తెలిపారు.

ఉగ్ర దాడిలో గాయపడిన డాక్టర్‌కు సీఎం పరామర్శ

కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడి, ప్రస్తుతం ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న రాష్ట్రానికి చెందిన డాక్టర్ పరమేశ్వరన్, ఆయన సతీమణి డాక్టర్ నయనతారకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఫోన్‌లో పరామర్శించారు. పరమేశ్వరన్‌కు అందుతున్న చికిత్స గురించి ఆయన భార్యను అడిగి తెలుసుకున్నారు. ఏ సహాయం కావాలన్నా ఢిల్లీలో తమిళనాడు హౌస్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం అధికారులను సంప్రదించాలని స్టాలిన్ ఆమెకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవడంతో తాము సకాలంలో దాడి జరిగిన ప్రాంతం నుండి త్వరగా బయటపడ్డామని, ఎయిర్ అంబులెన్స్ ద్వారా తన భర్తను ఢిల్లీకి తీసుకువచ్చి ఎయిమ్స్‌లో చేర్చారని నయనతార ముఖ్యమంత్రికి వివరించారు. అదే సమయంలో తమకు అన్ని విధాలా సాయమందించిన ముఖ్యమంత్రికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

రేపటి నుంచి కోవైలో టీవీకే బూత్ ఏజెంట్ల మహానాడు

● హాజరుకానున్న విజయ్

అడయార్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో విజయ్ సారథ్యంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) మహానాడుకు కోయంబత్తూరులో జరుగనుంది. ఈ నెల 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే మహానాడుకు సుమారు 16 వేల మంది బూత్ ఏజెంట్లు హాజరుకానున్నారు. ఈ మహానాడుకు వెస్ట్ జోన్ పరిధిలోని కోయంబత్తూరు, తిరుపూరు, నీలగిరి, ఈరోడ్, సేలం, నామక్కల్, కరూర్ జిల్లాలకు చెందిన బూత్ ఏజెంట్లు పాల్గొంటున్నారు. ఇందుకోసం మహానాడు నిర్మాణ వేదిక, ఇతర నిర్మాణ పనులను బుధవారం పూజా కార్యక్రమంతో ప్రారంభించారు. ఈ పనులను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అక్కడే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. తొలి రోజు మహానాడులో 8 వేల మంది, రెండో రోజు 8 వేల మంది చొప్పున బూత్ ఏజెంట్లు పాల్గొననున్నారు. వేసవి ఎండలు అధికంగా ఉండటంతో మహానాడు సాయంత్రం 3 గంటల నుంచి ప్రారంభించనున్నారు. తొలి రోజు ఈరోడ్, సేలం, నామక్కల్ జిల్లాలకు చెందిన ఏజెంట్లు, రెండో రోజున కరూర్, కోయంబత్తూరు, తిరుపూరు, నీలగిరి జిల్లాలకు చెందిన ఏజెంట్లు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో కొత్త సభ్యుల చేరిక, ఎన్నికల సమయంలో ఎలా నడుచుకోవాలి తదితర అంశాలపై విజయ్ సూచన చేయనున్నారు. ఇందులో విజయ్‌తో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఎన్నికల నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జున తదితరులు హాజరుకానున్నారు. కాగా, రాజకీయ పార్టీ స్థాపించిన తర్వాత కోయంబత్తూరుకు రానున్న విజయ్‌కు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు.



సమావేశానికి హాజరయ్యే ఏజెంట్లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న బుస్సీ ఆనంద్

● మహిళలపై పొన్ముడి వ్యాఖ్యల వ్యవహారం...

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు



చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు, శైవ, వైష్ణవ మతాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి పొన్ముడిని మంత్రి పదవి నుండి డిస్మిస్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం సూచించింది. విల్లుపురం సమీపంలో ద్రావిడ కళగం ఆధ్వర్యంలో ఈ నెల 8న జరిగిన సభలో మంత్రి పొన్ముడి మాట్లాడుతూ ఓ వేశ్య, విటుడి మధ్య జరిగిన సంభాషణలు చెబుతానంటూ మహిళలను, శైవ, వైష్ణవ మతాలను కించపరిచేలా అశ్లీలకరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో రెండు మతాలను కించపరిచేలా ప్రసంగించిన పొన్ముడిని మంత్రిపదవి నుండి డిస్మిస్ చేసేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ హైకోర్టులో న్యాయవాది పి.జగన్నాథ్ పిటిషన్ వేశారు. పొన్ముడి వ్యాఖ్యలు రాజ్యాంగ ధర్మాసనానికి వ్యతిరేకమైనవని ఆయన ఆరోపించారు. ఈ పిటిషన్ విచారణ పెండింగ్‌లో ఉన్నప్పుడే మంత్రి అక్రమార్జన కేసులపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ శైవ, వైష్ణవమతాలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ పొన్ముడిపై పోలీసులు ఎందుకు కేసు నమోదుచేయలేదని ఆగ్రహం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. పోలీసులు వీలైనంత త్వరగా పొన్ముడిపై కేసు నమోదు చేయకపోతే తామే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం మళ్ళీ ఈ విషయంపై విచారణకు రాగా పొన్ముడిపై దాఖలైన ఇలాంటి కేసు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో విచారణకు వచ్చిందని, పొన్ముడి చేసిన వ్యాఖ్యలు అశ్లీలంగా, అసభ్యకరంగా లేవని ఆ కేసును తోసిపుచ్చారని ప్రభుత్వ తరఫు న్యాయమూర్తి విల్సన్ తెలిపారు. పొన్ముడి మాటలు ద్వేషపూరిత ప్రసంగాల పరిధిలోకే వస్తుందని, ఈ విషయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కేసును హైకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ జరపాలని కోరుతూ ప్రధాన న్యాయమూర్తికి ప్రతిపాదించేలా చర్యలు చేపట్టాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పొన్ముడిని డిస్మిస్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిసన్ గురువారం ప్రధాన న్యాయమూర్తి శ్రీరామ్, న్యాయమూర్తి మహ్మద్ సబీక్‌తో కూడిన ప్రధమ ధర్మాసం ఎదుట విచారణకు వచ్చింది. ఈ కేసుకు సంబంధించి పిటిషనర్ దాఖలు చేసిన అదనపు పిటిషన్‌లో ఈ కేసుతో సంబంధం లేని ముఖ్యమంత్రిని రచ్చకీడ్చేలా కొన్ని అభిప్రాయాలు వ్యక్తం చేశారని, ఆ అభిప్రాయాలను తొలగించాలని ప్రభుత్వ తరఫు న్యాయవాది డిమాండ్ చేశారు. ప్రభుత్వ తరఫు న్యాయవాది తెలిపిన వివరాలను తొలగించేందుకు పిటిషనర్ అంగీకరించారు. ఈ కేసుకు సంబంధించి జూన్ 5లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రథమధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేసింది.

సమాచార ధ్వని

'నీట్' కేంద్రాల వివరాలు విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యూజీ వైద్య కోర్సుల ప్రవేశానికి నిర్వహించే 'నీట్'కు దరఖాస్తు చేసుకున్న వారికి, పరీక్ష జరిగే నగరాల జాబితాను జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మే 4వ తేది దేశవ్యాప్తంగా 552 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నీట్ జరుగనుంది. దరఖాస్తుదారులకు కేటాయించిన నగరం వివరాలు వారి 'లాగిన్'లోకి వెళ్లి తెలుసుకోవచ్చు. ఈ జాబితా పరీక్షా కేంద్రం సమాచారం మాత్రమే, హాల్ టిక్కెట్లు తర్వాత విడుదల చేయనున్నారు. జాబితాలో సందేహాలుంటే 011-40759000, 69227700 అనే నెంబర్లు, neetug2025@nta.ac.in అనే ఈ-మెయిల్ ద్వారా తెలుసుకోవచ్చని ఎన్టీఏ ప్రకటనలో తెలిపింది.

21 నుంచి 'ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్'

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 21 నుంచి ఐదురోజులు 'ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్' నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో ఫ్రాన్స్, జర్మనీ, థాయ్‌లాండ్, సింగపూర్, మలేసియా, స్విట్లర్లాండ్ తదితర 8 దేశాలకు చెందిన రైడర్లు పాల్గొని, సుమారు 200 వరకు భారీ గాలిపటాలు ఎగురవేయనున్నారు. ఈ విషయమై పర్యాటక శాఖ అధికారులు మాట్లాడుతూ... ఈసీఆర్ రోడ్డులో నిర్వహించనున్న ఈ ప్రదర్శన వీక్షించేందుకు పిల్లలకు ఉచిత ప్రవేశం, పెద్దలకు రూ.200 రుసుముగా నిర్ణయించామన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. రాత్రి ప్రదర్శనలో ఎల్ఈడీ బల్బులు అమర్చిన గాలిపటాలు ఎగురవేయనున్నారని తెలిపారు.

1 నుంచి కుటుంబ సంక్షేమ కోర్టులకు సెలవులు

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను పురస్కరించుకుని మే 1 నుంచి 15వ తేది వరకు కుటుంబ సంక్షేమ కోర్టులకు సెలవు ప్రకటిస్తూ మద్రాసు హైకోర్టు ప్రధాన రిజిస్ట్రార్ అల్లి ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని కోర్టులకు ఈ సెలవులు వర్తించనున్నాయి. మద్రాసు హైకోర్టు మహిళా న్యాయవాదుల సంఘం విజ్ఞప్తి మేరకు సెలవులు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ప్రకటనలో తెలిపారు.

జూన్ 16న డిగ్రీ కళాశాలలు పునః ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు తరువాత జూన్ 16వ తేది ఆర్ట్స్, సైన్స్ కళాశాలలు ప్రారంభమవుతాయని ఉన్నత విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వార్షిక, సెమిస్టర్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 16 నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్, స్వయం ప్రతిపత్తి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు పునఃప్రారంభమవుతాయని ఉన్నత విద్యాశాఖ తెలిపింది.

నేటి నుంచి వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్తాలు, వారాంతపు సెలవుల సందర్భంగా 1,170 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం కిళాంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి సహా పలు నగరాలకు శుక్రవారం (ఈ నెల 25వ తేది) 370 బస్సులు, శనివారం 450 బస్సులు నడుపున్నారు. కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, హోసూరు, బెంగళూరు తదితర నగరాలకు శుక్ర, శనివారాల్లో తలా 60 బస్సులు, మాధవరం నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపున్నారు. అలాగే, సెలవులు ముగించుకుని వచ్చే వారి కోసం పలు నగరాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. శుక్రవారం ప్రయాణించేందుకు 7,970 మంది, శనివారం 5,115, ఆదివారం 7,189 మంది ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

జూన్ 2 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం జూన్ 2వ తేది పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. దీంతో, శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. నిర్వహణ రీత్యా ఉపాధ్యాయులు ఈ నెల 30వ తేది వరకు పాఠశాలలకు రావాల్సి ఉంటుంది. వేసవి సెలవుల తరువాత జూన్ 2వ తేది ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత, మహోన్నత పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. సెలవు రోజుల్లో పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపట్టాలని పాఠశాల విద్య డైరెక్టర్ కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు.

'మయోనైస్' విక్రయాలకు నిషేధం

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్ల నుంచి తయారుచేసే 'మయోనైస్' విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాటు నిషేధం విధించింది. ఈ విషయమై సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... వీధి ఆహారాలు, షవర్మ, తందూరి తదితర మాంసాహార వంటకాల్లో మయోనైస్ వినియోగం అధికమైంది. కోడిగుడ్డులోని పసుపుసొనతో చేసే మయోనైస్ ఆరోగ్యానికి హాని కలిగిస్తుందనే పరిశోధన నేపథ్యంలో, మయోనైస్ విక్రయాలపై ఏడాది నిషేధం విధించింది. నిషేధం ఉల్లంఘించే వారిపై జరిమానా, లైసెన్స్ రద్దు తదితరాలు చేపట్టనున్నట్లు, ప్రజలు కూడా మయోనైస్‌తో చేసే ఆహార పదార్థాలు కొనుగోలు చేయరాదని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

జూన్‌లో విన్‌ఫాస్ట్ కార్ల కర్మాగారం ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలో జూన్ నెలలో విన్‌ఫాస్ట్ కార్ల కర్మాగారం ప్రారంభించనున్నట్లు సచివాలయ అధికారులు తెలిపారు. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ సంస్థ తూత్తుకుడిలో రూ.4,276 కోట్ల పెట్టుబడులతో కార్ల తయారీ కర్మాగారం ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఆ ప్రకారం ఫిబ్రవరిలో ఆ కర్మాగారానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. అమెరికాకు చెందిన టెస్లా కార్ల సంస్థకు అంతర్జాతీయంగా గట్టి పోటీ ఇస్తున్న విన్‌ఫాస్ట్ సంస్థ, తూత్తుకుడిలో కార్ల తయారీ కర్మాగారం ఏర్పాటుతో చుట్టుపక్కల జిల్లాలకు చెందిన వేలాది మందికి ఉద్యోగాలు లభించే అవకాశముందని అధికారులు తెలిపారు.

వైభవంగా కన్నియమ్మాళ్ ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు నియోజకవర్గం ఇరైయన్‌కాడు గ్రామంలో ఉన్న కన్నియమ్మాళ్ ఆలయ జీర్ణోద్ధరణ అష్టబంధన మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. వేడుకల్లో జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, యూనియన్ సెక్రటరీ వెంకటేశన్, వేలూరు యూనియన్ సెక్రటరీ జ్ఞానశేఖరన్, ఎస్పీ కుమార్, ఇళంగోవన్, ఆలయ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోలాహలంగా చేపలు పట్టే ఉత్సవం



చెరువులో చేపలు పడుతున్న ప్రజలు

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లాలో చేపలు పట్టే వేడుకలు కోలాహలంగా సాగాయి. కారియపట్టి కీళ అళగియనల్లూర్ చెరువు నీటిని రైతులు సాగు కోసం వినియోగిస్తుంటారు. సాగు ప్రారంభంలో చెరువులో గ్రామస్తులు చేపపిల్లలు వదులుతుంటారు. ప్రస్తుతం సాగు పనులు ముగిసిన నేపథ్యంలో, చెరువులో నీరు కూడా తగ్గింది. దీంతో, పారంపర్యంగా నిర్వహించే చేపలు పట్టే వేడుకలు నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఆ ప్రకారం, అచ్చంగుళం, మాంతోపు, కొప్పిలింగపట్టి, మల్లాంగ్‌కినరు, వరలొట్టి సహా పలు గ్రామాల్లో చేపల వేట జరుగుతున్నట్లు లౌడ్ స్పీకర్ల ప్రచారం చేశారు. బుధవారం ఉదయం గ్రామ పెద్ద జెండా ఊపడంతో, అప్పటికే సిద్ధంగా ఉన్న పలు గ్రామాల పిల్లా పెద్దా అంతా చెరువులో దిగి చేపలు పట్టేందుకు పోటీపడ్డారు. కొళత్తి, కొండై, వీరాల్ సహా పలురకాల చేపలు పట్టుబడ్డాయి. ఒక్కొక్కరు సుమారు 5 నుంచి 9 కిలోల చేపలు పట్టుకున్నారు. కొన్ని చేపలు 5 నుంచి 6 కిలోలు బరువున్నాయి.

మెగా జాబ్ మేళాల ద్వారా 2.49 లక్షల మందికి ఉద్యోగాలు

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 309 మెగా జాబ్ మేళాలు నిర్వహించి 2.40 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు కార్మిక సంక్షేమ శాఖ మంత్రి సీవీ గణేశన్ తెలిపారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో రామనాథపురం జిల్లాలో మూడు సార్లు నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని, మరో జాబ్ మేళా నిర్వహించాలని రామనాథపురం ఎమ్మెల్యే ఖాదర్‌బాషా ముత్తురామలింగం కోరారు. దానికి మంత్రి గణేశన్ సమాధానమిస్తూ, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో జిల్లా స్థాయిలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. డీఎంకే అధికారం చేపట్టినప్పటి నుంచి 309 మెగా జాబ్ మేళాలు నిర్వహించి 2,49,392 మందికి ఉద్యోగాలు కల్పించామని, రామనాథపురం సహా అన్ని జిల్లాల్లో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

వెండర్ డైమండ్స్ షోరూమ్ ప్రారంభం



షోరూమ్ ప్రారంభిస్తున్న నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ బాలాజి

వేలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై ఎంఎండీ కాంప్లెక్స్‌లో వెండర్ డైమండ్స్ రెండో షోరూమ్ ప్రారంభమైంది. గురువారం నారాయణి ఆసుపత్రి, రీసెర్చి కేంద్ర డైరెక్టర్ డాక్టర్ బాలాజీ ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వెండర్స్ డైమండ్స్ సీఈఓ డా.దినేష్ శంకర్, సురేష్‌బాబు, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

ప్యారీస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ది మద్రాస్ కార్పొరేషన్ రెడ్‌ఫ్లాగ్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు శ్రీనివాసులు నేతృత్వంలో రిప్పన్ బిల్డింగ్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ధర్నాలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో శ్రీనివాసులు మాట్లాడుతూ, చెత్త తొలగింపుకు ఉపయోగిస్తున్న వాహనాలు సరిగా పనిచేయడం లేదని, నాణ్యమైన విడిభాగాలతో వాటికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తంజై ప్రభుత్వాసుపత్రిలో అగ్నిప్రమాదం

● పసికందులతో పరుగులు తీసిన నర్సులు, తల్లులు



చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తంజావూరు ప్రభుత్వ రాజా మీరాసుదార్ ఆస్పత్రిలోని ప్రసూతి, చిన్నపిల్లల వార్డులో గురువారం హఠాత్తుగా అగ్నిప్రమాదం సంభవించింది. ఆ వార్డుల్లో ఉన్న గర్భిణులు, పిల్లలను నర్సులు, చుట్టుపక్కల వారు బయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది. తంజావూరు పాత బస్టాండ్ సమీపంలోని ఈ ఆస్పత్రి మొదటి అంతస్తులో ఉన్న విభాగంలో గురువారం ఈ విభాగంలో ఏసీ మెషీన్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన ఆస్పత్రి సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నించగా, దట్టమైన పొగలు అలుముకోవడంతో పాటు మంటలు పరిసరాలకు వ్యాపించాయి. దీంతో, ఆ విభాగంలో గర్భిణులు బయటకు పరుగులు తీశారు. చికిత్స పొందుతున్న పసికందులను నర్సులు, తల్లులు తీసుకొని బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రాజారాం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రసూతి, చిన్నపిల్లల విభాగంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుందని, అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణులు, పసిపిల్లలను వేరే భవనంలోకి తరలించామని, అదృష్టవశాత్తు అవాంఛనీయ ఘటనలు జరగలేదని కలెక్టర్ తెలిపారు.

ఈపీఎస్ కేసు విచారణపై స్టే

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి వ్యతిరేకంగా దాఖలైన కేసువిచారణపై మద్రాసుహైకోర్టు గురువారం తాత్కాలిక స్టే విధించింది. కోయంబత్తూర్ కోర్టుకు నేరుగా హాజరుకావడం నుంచి మినహాయింపు కల్పించింది. మాజీ ఎంపీ కేసీ పళనిస్వామి తనపై దాఖలు చేసిన కేసు కొట్టివేయాలని, స్వయంగా హాజరుకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఎడప్పాడి పళనిస్వామి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు.

● కొడనాడు హత్య, దోపిడీ కేసు...

సీబీసీఐడీ విచారణకు సయాన్ హాజరు



పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొడనాడు హత్య, దోపిడీ కేసులో సీబీసీఐడీ విచారణకు సయాన్ హాజరయ్యాడు. నీలగిరి జిల్లా కోతగిరి సమీపం కొడనాడులో దివంగత ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో 2017లో వాచ్‌మెన్ హత్య, ఎస్టేట్ భవనంలో దోపిడీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి సయాన్, వాళయార్ మనోజ్ సహా 10 మందిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వారు బెయిలుపై విడుదలయ్యారు. ఈ కేసు విచారణ చేపట్టిన సీబీసీఐటీ ఇప్పటివరకు 300 మందిని విచారించింది. ఈ కేసులో ముఖ్యమైన నిందితుడుగా భావిస్తున్న సయాన్‌ను ఇప్పటికే ఒకసారి సీబీసీఐడీ పోలీసులు విచారించారు. ఈ కేసులో అతనిని మళ్లీ విచారించాలని నిర్ణయించి సీబీసీఐడీ పోలీసులు సమన్లు జారీచేశారు. ఆ ప్రకారం, గురువారం కోవై గాంధీపురంలోని సీబీసీఐడీ కార్యాలయంలో జరిగిన విచారణకు సయాన్ హాజరయ్యాడు.

పోలీసులకు వారాంతపు సెలవు కావాలని పిటిషన్

ప్యారీస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖలో ఎస్ఐ నుంచి కానిస్టేబుల్స్ వరకు వారాంతపు సెలవు ప్రకటించేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో ఓ పిటిషన్ దాఖలైంది. మదురై ఆస్టిన్‌పట్టి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సెంథిల్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌లో... రాష్ట్ర పోలీస్ శాఖలో అధిక పనిభారంతో మానసికంగా, శారీరకంగా, విశ్రాంతి లేకుండా పోలీసులు పనిచేస్తూ ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయమై పోలీసుల తరుపున పలుమార్లు డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం, పోలీసులకు వారాంతపు సెలవు ఇవ్వాలని 2021లో జీవో కూడా విడుదల చేసిందని, అయినా, ఇప్పటివరకు ఆ జీవో అమలులోకి రాలేదని తెలిపారు. పని భారంతో ఇబ్బందుల పాలవుతున్న పోలీసుల సంక్షేమార్థం వారాంతపు సెలవు విధానాన్ని అమలుపరచేలా ఉత్తర్వులు జారీచేయాలని ఆ పిటిషనలో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి పట్టుదేవానంద్ సమక్షంలో బుధవారం మళ్లీ విచారణకు వచ్చింది. ప్రభుత్వం తరుపు న్యాయవాది, పిటిషనర్ తరుపు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి పోలీసులకు మద్దతుగా ఆదేశాలు జారీచేశారు. వారాంతపు సెలవు ఇవ్వని పక్షంలో పోలీసులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి కోర్టు ధిక్కారణ కేసు నమోదు చేయవచ్చని తెలుపుతూ తేదీ ప్రకటించకుండా తీర్పువాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పహల్గాం మృతులకు ఎస్డీపీఐ నివాళి



ఎస్డీపీఐ కొవ్వొత్తుల నివాళి

వేలూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో తీవ్రవాదుల దాడి మృతులకు ఎస్డీపీఐ తరఫున నివాళులర్పించారు. నగరంలో ఆ పార్టీ నేత బషర్ అహ్మద్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలు కొవ్వొత్తులతో మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇక్బాల్, మహమ్మద్ ఆజాద్, ఫెయిస్ అహ్మద్, నలావుల్లా, సయ్యద్ అల్‌ఫాతిమా పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన కార్యక్రమం



పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ పుస్తక దినోత్సవం' సందర్భంగా వెయ్యి మంది విద్యార్థులు గంట పుస్తక పఠనం చేశారు. నీలగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయం, గ్రంథాలయ పాఠకుల సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఊటీ హెచ్ఏడీపీ మైదానంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, పుస్తక ప్రియులు మొత్తం వెయ్యి మంది కూర్చొని గంట సేపు తమను నచ్చిన పుస్తకం చదివారు. విద్యార్థులు, ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

తిరుత్తణి హుండీ ఆదాయం రూ.1.40కోట్లు

తిరుత్తణి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ.1.40 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. చిత్తిరై మాస ఉత్సావాలను పురస్కరించుకుని గత 27 రోజులుగా భక్తులు ఆలయానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆలయ జాయింట్ కమిషనర్, ట్రస్టీ సురేష్‌బాబు పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. చిత్తిరై ఉత్సవాలు జరిగిన ఈ 27 రోజులకు రూ.1.40 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నగదుతో పాటు 632 గ్రాముల బంగారం, 13.434 కేజీల వెండి కూడా వచ్చినట్లు ఆలయ ట్రస్టీ సురేష్‌బాబు తెలిపారు.



వేలూరు జిల్లాలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వినియోగించనున్న ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి



వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో గురువారం పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న హిందూ మున్నని కోట అధ్యక్షులు మహేష్, కార్యకర్తలు

ఓపీఎస్‌తో సీమాన్ భేటీ

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికల వ్యూహంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం బీజేపీ మినహా తదితర పార్టీలతో పొత్తు కుదుర్చుకోవాలని నిర్ణయించారు. అదే సమయంలో విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగం (టీవీకే)తో పొత్తుకు ప్రయత్నించి విఫలమైన నామ్ తమిళర్ కట్చి(ఎన్టీకే) సమన్వయకర్త సీమాన్ ఒంటరిగానే పోటీ చేయాలా లేక ఇతర పార్టీలతో పొత్తుపెట్టుకోవాలా అని అయోమయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఓపీఎస్, సీమాన్ భేటీ అయ్యారు. ఇద్దరూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిపారు. అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు ఖరారు చేసుకున్న నేపథ్యంలో ఓపీఎస్ కొత్త పార్టీ ఏర్పాటు చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. కొత్తకూటమిని ఏర్పాటు చేసుకుని రెండు పార్టీలు కలిసి పోటీ చేయడానికి గల అవకాశాలపై ఇరువురూ సమగ్రంగా చర్చించారు.

పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన 'ఎఫ్‌హెచ్‌ఆర్ఐ'

అడయార్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలోని పహల్గాం, బైసరన్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ది ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌హెచ్‌ఆర్ఏఐ) ప్రతినిధులు ముక్తకంఠంతో ఖండించారు. ఈ దాడిలో అశువులుబాసిన వారి కుటుంబాలకు సాధ్యమైనంత వరకు సహాయాలను అందించడానికి, వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకునేందుకు అన్ని ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎఫ్‌హెచ్‌ఆర్ఏఐ పూర్తి సంఘీభావం తెలిపింది. ఈ విషయంపై ఆ అసోసియేషన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కశ్మీర్ వచ్చిన పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులు చేయడం హేయమైన చర్యగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్యామ రాజు పేర్కొన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి ఘటనను పిరికిపంద చర్య అని, దీన్ని తమ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

పార్ట్‌టైం టీచర్లను పర్మినెంట్ చేస్తాం

● మంత్రి అన్బిల్ మహేష్

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా పార్ట్ టైం ఉపాధ్యాయుల ఉద్యోగాల క్రమబద్ధీకరణపై త్వరలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నిర్ణయం తీసుకుని, ప్రకటిస్తారని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన అన్నాడీఎంకే ఎమ్మెల్యే సెంగోట్టయన్ డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత తాత్కాలిక ఉపాధ్యాయులను మాత్రమే నియమిస్తున్నారని, అలా నియమితులైన ఉపాధ్యాయులు తమను పర్మినెంట్ చేయాలని ఆందోళన చేస్తున్నారన్నారు. అందుకు మంత్రి అన్బిల్ మహేష్ సమాధానమిస్తూ... డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాతే పార్ట్‌టైం ఉపాధ్యాయుల వయోపరిమితి పెంచి, రూ.2,500 వేతనం పెంచామన్నారను. పార్ట్‌టైం ఉపాధ్యాయులను పర్మినెంట్ చేస్తామన్న డీఎంకే ఎన్నికల హామీని మరచిపోలేదని, త్వరలోనే ఈ విషయమై ముఖ్యమంత్రి మంచి నిర్ణయం ప్రకటిస్తారని మంత్రి తెలిపారు.

పులియంతోపులో రౌడీల అరెస్టు

అడయార్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియంతోపులో నగర పోలీసులు జరిపిన ఆకస్మిక తనిఖీల్లో 12 మంది రౌడీలను అరెస్టు చేశారు. వీరిలో బల్లు రవి, గణేశన్, శంకర్, కార్తిక్, తొట్టి మణి, కార్తిక్, సుధాకర్, పుష్పాకరన్ , హెన్రీ కుమార్, బాలాజీ, సురేష్ , శ్యామ్ తదితరులు ఉన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. వీరిపై గతంలో కూడా పలు కేసులున్నట్టు పోలీసులు గుర్తించారు.

ఆమ్నీ బస్సులో రూ.40 లక్షల స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆమ్నీ బస్సులో తరలిస్తున్న రూ.40 లక్షల హవాలా నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరం నుంచి మన్నార్‌గుడికి బుధవారం రాత్రి బయల్దేరిన ఆమ్నీ బస్సును గురువారం తెల్లవారుజామున కడలూరు సమీపం ఆల్‌పేట చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్ పోలీసులు ఆపి తనిఖీ చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువకుడి బ్యాగు తనిఖీ చేసిన పోలీసులు, అందులో రూ.40 లక్షలు గుర్తించారు. విచారణలో... అతని పేరు నవీన్ అన్వర్ అని, ఈ నగదుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో, ఈ నగదు ఎవరిది? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.

హెల్మెట్ లేని 274 మంది పోలీసులకు జరిమానా

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించని 274 మంది పోలీసులు జరిమానా విధించారు. పలువురు పోలీసులు హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడుపుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి. ఈ విషయమై దృష్టి సారించిన పోలీసు శాఖ, చట్టం ముందు అందరూ సమానులేనని, ద్విచక్రవాహనాలు నడిపే పోలీసులకు కూడా హెల్మెట్ ధరించాలంటూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు అమలులోకి వచ్చిన నాలుగు రోజుల్లో హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడిపిన 274 మంది పోలీసులకు తలా రూ.1,000 జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కళాశాల విద్యార్థులు మృతిచెందారు. పసుపతిపాళయం ప్రాంతానికి చెందిన బాలాజి (19), కరూర్ వెంగమేడు ప్రాంతానికి చెందిన తిరుపతి (19) నామక్కల్ జిల్లా తిరుచెంగోడు-ఈరోడ్ రోడ్డు సమీపంలోని ప్రైవేటు కళాశాలలో బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. బుధవారం సెమిస్టర్ పరీక్ష రాసిన ఇద్దరూ ద్విచక్రవాహనంలో కరూర్‌కు బయల్దేరారు. తిరుపతి నడుపుతున్న వాహనం, సిత్తాలందూర్ సమీపం కాట్టుపాళయం జంక్షన్ రోడ్డులో వస్తుండగా ఎదురుగా వస్తున్న లోడు వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలైన ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తిరుచెంగోడు టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి, ప్రమాదానికి కారణమైన లోడు వాహనం డ్రైవర్ దేవాంకుర్చి ప్రాంతానికి చెందిన రమేష్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

చెత్త కుండీలో పసికందు మృతదేహం

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూర్‌లోని చెత్త కుండీలో ఆరు నెలల పసికందు మృతదేహం ఉండడం కలకలం రేపింది. రాజమంగళంలోని చెత్త కుండీలో ఆరు నెలల మగ శిశువు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని శిశువు మృతదేహం స్వాధీనం చేసుకున్నారు. శిశువును హతమార్చి నైటీలో చుట్టి పడేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, శిశువును చెత్త కుండీలో వేసిన వారి ఆచూకీ కోసం విచారిస్తున్నారు.

నీటమునిగి ఇద్దరు బాలుర మృతి

పెరంబూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నీటమునిగి ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటన కరూర్ జిల్లాలో చోటుచేసుకుంది. కరూర్ వెంగమేడు ప్రాంతానికి చెందిన డైవింగ్‌సన్ (13), కవిదాసన్ (14) అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 7,9వ తరగతి చదువుతున్నారు. వీరు బుధవారం సాయంత్రం స్నేహితులతో కలసి సమీపంలోని అమరావతి నదికి స్నానాలకు వెళ్లారు. అందరూ స్నానం చేస్తున్న సమయంలో డైవింగ్‌సన్, కవిదాసన్ లోతైన ప్రాంతంలో నీటమునిగాడు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు నదిలో గాలించి ఆ మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనపై కరూర్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వానగరంలో లా విద్యార్థి ఆత్మహత్య

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వానగరంలో ఓ లా కాలేజీ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వానగరం కన్నియమ్మన్ నగర్ ప్రాంతానికి చెందిన ధనశేఖరన్ కుమారుడు జ్ఞాన ప్రకాష్ (26) తిరుపతిలోని ఓ విశ్వవిద్యాలయంలో లా కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఇంటిలో తన గదిలో పడుకున్న జ్ఞాన ప్రకాష్ గురువారం ఉదయం లేవలేదు. అతడి గది నుండి ఎలాంటి అలికిడి కూడా వినిపించలేదు. దీంతో అనుమానం వచ్చిన ధనశేఖరన్ చుట్టుపక్కల వారి సాయంతో గది తలుపులు పగులగొట్టి చూడగా జ్ఞాన ప్రకాష్ గదిలో ఉరివేసుకుని వేలాడుతుండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. సమాచారం అందుకున్న వానగరం పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

చిత్రజ్యోతి

'టూరిస్ట్ ఫ్యామిలీ' ఫీల్‌గుడ్ మూవీ : హీరో శశికుమార్

సాధారణంగా ఈలం తమిళుల జీవన స్థితిగతులను ఇతివృత్తంగా తీసుకుని నిర్మించే చిత్రాలను చూస్తున్నపుడు ప్రేక్షకుల మనసులో చిన్న బాధ కలుగుతుందని, అలాంటి నేపథ్యంలోనే రూపొందిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' మాత్రం వినోదాత్మకంగా సాగుతుందని, అందుకే ఇది ఒక ఫీల్ గుడ్ మూవీ అంటానని హీరో శశికుమార్ అన్నారు. డెబ్యూ డైరెక్టర్ అభిషన్ జీవింత్ రూపొందించిన ఈ మూవీలో శశికుమార్, సిమ్రన్ జంటగా నటించారు. ఇతర పాత్రల్లో యోగిబాబు, మిథున్ జైశంకర్, కమలేష్, ఎంఎస్ భాస్కర్, రమేష్ తిలక్, బక్స్ భగవతి పెరుమాళ్, ఇళంగో కుమరవేల్, శ్రీజా రవి తదితరులు నటించారు. మిలియన్ డాలర్స్, ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్మెంట్ అధినేతలు నజరెత్ పసిలియన్, మగేష్ రాజ్ పసిలియన్, యువరాజ్ గణేశన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం మే ఒకటో తేదీ విడుదలకానుంది. నగరంలో బుధవారం ఆడియో రిలీజ్ సందర్భంగా హీరో శశికుమార్ మాట్లాడుతూ, 'ఇలాంటి మంచి కథ విని చాలా రోజులైంది. అందుకే దర్శకుడు సిద్ధం చేసిన స్క్రిప్టులో ఒక్క మార్పు కూడా చేయలేదు. ఇది నిజంగా దర్శకుడు సాధించిన తొలి విజయం. నాతో పాటు హీరోయిన్‌గా సిమ్రన్ నటిస్తున్నారని తెలియగానే ఎంతో సంతోషించాను. ఈ కథ నచ్చడం వల్లే ఆమె అంగీకరించిందని, అందువల్ల మా ఇద్దరిని కూడా హీరోహీరోయిన్లుగా భావించండి. తమిళ భాషను మరచిపోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందనే భావన వారిలో కలుగుతుంది. ఈ తరహా భావన సినిమా చూసిన ఓ పది మందికి కలిగినా మేం విజయం సాధించినట్టే' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ, 'నేను సిద్ధం చేసిన స్టోరీ హీరో శశికుమార్ అని ముందే నిర్ణయించుకుని ఆయనను కలిసి కథ వినిపించగా, ఆయన వైపు నుంచి ఎలాంటి స్పందనలు కనిపించలేదు. సాయంత్రానికి నిర్మాత యువరాజ్ ఫోన్ చేసి సినిమా చేస్తున్నాం అని చెప్పడంతో ఈ కల నిజమైంది. సిమ్రన్ వంటి అనుభవజ్ఞులతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది' అన్నారు.



'టూరిస్ట్ ఫ్యామిలీ' ఆడియో రిలీజ్ దృశ్యం

భారీ బడ్జెట్‌తో 'డిడి నెక్స్ట్ లెవల్' మూవీ : సంతానం



'డిడి నెక్స్ట్ లెవల్'లో సంతానం - గీతిక తివారి

'దిల్లుక్కు దుడ్డు' (డిడి) సిరీస్‌లో కొత్తగా రూపొందిన 'డిడి నెక్స్ట్ లెవల్' మూవీని భారీ బడ్జెట్‌తో రూపొందించి, వచ్చే నెలలో విడుదల చేయనున్నట్టు హీరో సంతానం తెలిపారు. ది షో పీపుల్ పతాకంపై వెంకట్ బోయినపల్లి ఈ చిత్రాన్ని నిర్మించగా, హీరోయిన్‌గా గీతిక తివారి నటించారు. ఇతర పాత్రల్లో నిళల్‌గల్ రవి, కస్తూరి, యాషికా ఆనంద్, రెడిన్ కింగ్స్లీ, లొల్లుసభ మారన్, మొట్టై రాజేంద్రన్ తదితరులు నటించారు. ఈ సినిమా గురించి హీరో సంతానం మాట్లాడుతూ "దిల్లుకు దుడ్డు' సినిమా సక్సెస్ తర్వాత అదే తరహా చిత్రాలను ప్రేక్షకులు బాగా ఇష్టపడుతున్నారు. అందుకే 'డీడీ రిటర్న్స్' వరకు వచ్చాయి. ఇపుడు 'డిడి నెక్స్ట్ లెవల్' మూవీ తెరకెక్కింది. సీనియర్ దర్శకులు సెల్వరాఘవన్, గౌతమ్ వాసుదేవ్ మేనన్ వంటి వారు కూడా ఇందులలో నటించారు. ఈ మూవీతో గీతికా తివారి టాలీవుడ్ నుంచి కోలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఇందులో నేను సినిమాను విశ్లేషించే (రివ్యూ) యూట్యూబర్ పాత్రలో నటించాను. ఈ విశ్లేషణ వల్ల ఎదురయ్యే సమస్యలు ఏంటి అన్నదే ఈ చిత్ర కథ' అన్నారు.




అవార్డులు ముఖ్యం కాదు

● సాయిపల్లవి

తనకు అవార్డులు ప్రధానం కాదని, అభిమానుల ప్రేమాభిమానాలే ముఖ్యమని నటి సాయిపల్లవి అంటున్నారు. తమిళంలో శివ కార్తికేయన్ హీరో నటించిన 'అమరన్', తెలుగులో అక్కినేని నాగ చైతన్య నటించిన 'తండేల్' వంటి వరుస బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన సాయిపల్లవి ప్రస్తుతం బాలీవుడ్‌లో రూపొందుతున్న 'రామాయణం'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'నాకు అవార్డులు ముఖ్యం కాదు. వారి ప్రేమాభిమానులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను. నేను నటించే కథాపాత్రలకు అభిమానులు భావోద్వేగ భావాలతో కనెక్ట్ కావాలి. అభిమానులు లీనమయ్యేలా పాత్రల ద్వారా ప్రదర్శన ఇవ్వాలి. అదే నాకు లభించే నిజమైన విజయం, అవార్డుగా భావిస్తాను' అని పేర్కొన్నారు.

'ధనుష్-56'కు ఏఆర్ రెహ్మాన్ సంగీతం



ధనుష్, మారి సెల్వరాజ్, గణేష్, రెహ్మాన్

ధనుష్ హీరోగా నటించే 56వ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందించనున్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ప్రముఖ నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంగీత స్వరాలు సమకూర్చేందుకు ఏఆర్ రెహ్మాన్‌ను ఎంపిక చేసినట్టు నిర్మాత వెల్లడించారు. కాగా, తమిళంలో ఏఆర్ రెహ్మాన్ వరుస చిత్రాలకు సంగీతం అందిస్తున్నారు. ఇపుడు మరో చిత్రానికి సంగీత స్వరాలు సమకూర్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే, ధనుష్ - మారి సెల్వరాజ్ కాంబినేషన్‌లో 'కర్ణన్' వంటి ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే.

గ్రహదోష పరిహార క్షేత్రం

తిరుకుళందై వేంకటవానన్ ఆలయం



ఆలయ రాజగోపురం



ఆలయ ప్రవేశద్వారం

అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో తూత్తుకుడి జిల్లా పెరుంకుళం (తిరుకుళందై) వేంకటవానన్ ఆలయం 95వది. ఈ దివ్యదేశానికి నమ్మాళ్వార్ మంగళాశాసనమొనర్చారు. తిరువాయ్‌మొళిలో ఈ క్షేత్రం విశేషాలను ప్రస్తావించారు. ఈ క్షేత్రం నవగ్రహ దోషాల నుండి విముక్తి కలిగించే దివ్యక్షేత్రం. ప్రత్యేకించి ఇక్కడి వేంకటవానన్ స్వామి శనిగ్రహపీడితులకు ఉపశమనం కలిగించి, వారి జీవితాలను ఉన్నత స్థితికి తీసుకెళతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. తిరుచెందూరు ఆలయానికి వెళ్లే భక్తులు తప్పకుండా ఈ 'నవతిరుపతుల'ను కూడా దర్శించటం ఆనవాయితీ. ఆ నవ తిరుపతుల్లో ఈ క్షేత్రం శనీశ్వరుడి అనుగ్రహ క్షేత్రంగా కీర్తిగడించింది.

టి.నగర్, ఆంధ్రజ్యోతి

స్థలపురాణం : తామ్రభరణి నది ఉత్తరాన ఉన్న తిరుకుళందై అనే ఓ కుగ్రామంలో వేదాచార్యులు అనే బ్రాహ్మణుడుండేవారు. ఆయన కుమార్తె కమలావతి. ఆమె సకలసౌందర్యరాశి తిరుమాళ్‌ను నియమనిష్ఠలతో ఆరాధించిన పరమభక్తురాలు. పెరుమాళ్ అనుగ్రహం కోసం కమలావతి ఘోర తపస్సు చేశారు. ఆమె తపస్సును మెచ్చిన శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై కమలావతిని పరిణయమాడారు. బాలిక తపమాచరించిన స్థలం కనుక ఈ ప్రాంతానికి బాలికావనం పేరొచ్చింది. ఓ సమయాన చోరాన్ అనే రాక్షసుడు వేదాచార్యుల భార్య కుముదవతిని అపహరించాడు. వేదాచార్యులు తన సతీమణిని కాపాడమంటూ శ్రీనివాసుడిని వేడుకున్నాడు. తన భక్తుడి ఆర్తనాదం విన్న వెంటనే పెరుమాళ్ ఆగమేఘాలపై వచ్చి ఆ రక్కసుడిని చీల్చిచెండాడి అతడిపై నాట్యమాడారు. ఆ నృత్యాన్ని వీక్షించిన దేవతల అభీష్టంప్రకారం 'మాయకూత్తన్' అనే తిరునామాన్ని కూడా పొందారు. ఇక స్వామివారిని మోసే గరుడాళ్వార్ ఈ ఆలయంలోని పెరుమాళ్ చెంతనే ఉత్సవమూర్తిగా ఉన్నారు. నవతిరుపతుల్లో పెరుమాళే నవగ్రహంగా పరిగణించడం వల్ల ఆ తొమ్మిది క్షేత్రాల్లో నవగ్రహాలకు ప్రత్యేక సన్నిధి లేదు. భక్తులు తమకున్న గ్రహ దోషాలను బట్టి నవతిరుపతులలో ఏదైనా ఒక క్షేత్రాన్ని ఎంపిక చేసుకుని ప్రత్యేక పూజలు చేసి గ్రహ దోషాల నుండి విముక్తి పొందుతున్నారు.



ఇష్టదేవేరులతో వేంకటవానన్

ఆలయ వైభవం... : ఆనందనిలయ విమానం దిగువన గర్భాలయంలో మూలవిరాట్టు వేంకటవానన్ పెరుమాళ్ తూర్పుదిశగా భక్తులకు దర్శనమిస్తున్నారు. స్వామివారి చెంత వేదాచార్యులు, ఆయన సతీమణి కుముదవతి నమస్కరిస్తూ కనిపిస్తారు. వీరితోపాటు బృహస్పతి కూడా కొలువుదీరి ఉన్నారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద పందిరి మండపంలో తిరుమంజన పాత్ర ఉంటుంది. ఆలయంలోపల కళనీర్ తురైయాన్ సన్నిధి, ధ్వజస్తంభమండపం, మహా మండపం, అర్థమండపం ఉన్నాయి. అర్ధమండపంలో ఉన్న ఉత్సవర్లను మాయకూత్తర్ అని పిలుస్తారు. ఆ స్వామికి ఇరువైపులా అలమేలు మంగ తాయారు, కుళందైవల్లి పూజలందుకుంటున్నారు. మూలవర్లను దర్శించిన మీదట గరుడాళ్లార్లను దర్శించవచ్చు. ఓ గరుడాళ్వార్ సర్పాన్ని పట్టుకుని స్వామివారి అనుగ్రహం కోసం ప్రార్థిస్తున్నట్లు పాదాలను మడిచి రెక్కలను రెపరెపలాడిస్తున్నట్టు కనిపిస్తారు. ఆలయ అంతర ప్రాకారంలో ఆళ్వార్లు, ఉడయవర్, సోనై ముదలియార్, మణవాళమా మునులు కూడా భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఈ ఆలయానికి దిగువ వైపున వళుదీశరాలయం ఉంది. పాండ్య దేశాన్ని పాలించిన ఉగ్ర పెరువళుది ద్వారా ప్రతిష్ఠింపబడిన పరమేశ్వరుడు ఇక్కడ కొలువుదీరారు.

ఉత్సవర్లకు స్వర్ణకవచం... : ఆళ్వార్ తిరునగరిలో నాయకర్ మండపాన్ని నిర్మించిన తర్వాత వైఖాసి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆ సమయలో నవతిరుపతుల నుండి పెరుమాళ్ళు ఆ క్షేత్రానికి వేంచేయడం ఆనవాయితీ. ఓ పర్యాయం ఆ వేడుకలకు చెన్నై నుంచి వెళ్లిన ఓ భక్తుడి కుటుంబీకులు నవతిరుపతుల్లో ఓ క్షేత్రానికి చెందిన ఉత్సవమూర్తికి స్వర్ణకవచం కానుకగా సమర్పించాలని భావించారు. ఆ వేడుకలలో మొదటగా వచ్చే పెరుమాళ్‌కు స్వర్ణకవచం సమర్పించాలని నిర్ణయించారు. ఆ రోజున మాయకూత్తర్ అక్కడికి వేంచేశారు. చెన్నై భక్తుడు తాను మొక్కుకున్నట్లే మాయకూత్తర్ ఉత్సవమూర్తికి స్వర్ణకవచాన్ని కానుకగా సమర్పించారు. ఈ ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. తిరుమల ఆలయంలో నిర్వహించే ఉత్సవాలు ఈ క్షేత్రంలోనూ నిర్వహిస్తారు.



స్వర్ణకవచధారణతో శయనభంగిమలో స్వామివారు

ఆధ్యాత్మికం



గరుడవాహనంపై స్వామివారు

ఎలా వెళ్లాలి? : రాజధాని నగరం చెన్నై సహా పలు నగరాల నుండి తిరునల్వేలికి రాష్ట్ర రవాణా సంస్థలు, బస్సులు, ఆమ్నీ బస్సులు నడుస్తున్నాయి. చెన్నై నుంచి తిరునల్వేలికి రైలు సర్వీసులు కూడా ఉన్నాయి. తిరునల్వేలి నగరానికి చేరుకుని అక్కడి నుండి 25 కి.మీల. దూరంలో ఉన్న తిరుకుళందై వేంకటవానన్ ఆలయానికి టౌన్ బస్సులు, ఆటోలు, షేర్ ఆటోలు, వ్యాన్‌లు, టాక్సీలలో వెళ్లవచ్చు. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుండి రాత్రి 7.30 వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

మూలవర్లు	: వేంకటవానన్, శ్రీనివాసన్
ఉత్సవర్లు	: మాయకూత్తర్
తాయార్	: అలమేలుమంగై, కమలావతి, కుళందైవల్లి తాయార్
తీర్థం	: పెరుంకుళ తీర్థం
విమానం	: ఆనంద నిలయ విమానం



మూలవర్లు - కుళందైవళ్ళి తాయార్

ఆంధ్రకళా స్రవంతి అడ్వైజర్ మూర్తి కన్నుమూత



ఎంఎస్ మూర్తి (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో రాణిస్తున్న ఆంధ్రకళా స్రవంతి సలహాదారు ఎంఎస్ మూర్తి (86) అనారోగ్యంతో మృతిచెందారు. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఈ నెల 17న వానగరంలో ఉన్న అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక గురువారం మధ్యాహ్నం సుమారు 2 గంటలకు ఆయన మరణించినట్లు ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం గ్రామంలో జన్మించిన మూర్తి క్రోమ్‌పేటలోని ఎంఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి, కోల్‌కతాలోని హిందూస్తాన్ మోటార్స్‌లో కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత మార్షల్స్ కంపెనీ జనరల్ మేనేజర్‌గా పనిచేసి పదవీవిరమణ చేశారు. ఆ తర్వాత ఆయన రాయలసీమ పవర్ కార్పొరేషన్‌లో సలహాదారుడిగా కొనేళ్ళపాటు సేవలందించారు. 1977లో అన్నానగర్‌లో కుటుంబంతో నివసించిన ఆయన 1984లో నగరంలోని తెలుగు ప్రజల కోసం జేఎం నాయుడుతో కలిసి ఆంధ్ర కళా స్రవంతిని ప్రారంభించి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ 40 ఏళ్ళలో సంస్థలో పలు పదవులు చేపట్టి, ఆధ్యాత్మిక, సామాజిక, సాంఘిక సేవలను విజయవంతంగా నిర్వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఎంఎస్ మూర్తి మృతి పట్ల ఆంధ్రకళా స్రవంతి అధ్యక్షులు జేఎం నాయుడు, సంస్థ కార్యవర్గ సభ్యులు, ద్రవిడ దేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు, నగరంలోని పలు తెలుగు సంఘాల నిర్వాహకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆళ్వార్‌పేట కావేరి హాస్పిటల్‌లో ఒ-ఆర్మ్ సర్జికల్ సిస్టమ్ ప్రారంభం



ఒ-ఆర్మ్ సర్జికల్ సిస్టమ్ ప్రారంభోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, కావేరి గ్రూప్‌ఆఫ్ హాస్పటల్స్ ఈడీ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, వైద్యనిపుణులు

చెన్నై, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సలకు కృత్రిమ మేధో పరిజ్ఞానం (ఏఐ)తో కూడిన 'ఒ - ఆర్మ్ సర్జికల్ సిస్టమ్'ను గిండి స్టార్‌హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ ప్రారంభించారు. ఆ సందర్భంగా మెదడు, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ క్రిష్ శ్రీధర్ మాట్లాడుతూ మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సల సందర్భంగా వైద్యనిపుణులకు ఈ ఆర్మ్ సర్జికల్ సిస్టమ్ మార్గదర్శిగా పనిచేస్తుందని, సూక్ష్మమైన కణాలను కూడా 2డి, 3డి ఇమేజ్‌లో ప్రదర్శింపజేసి శస్త్రచికిత్సను త్వరగా ముగించేందుకు కూడా ఈ సిస్టమ్స్ దోహపడుతుందని తెలిపారు. కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరవిందన్ సెల్వరాజ్, వైద్యనిపుణులు శ్యామ్ సుందర్ కృష్ణన్, ఇస్రో డైరెక్టర్ రాజరాజన్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అయప్పన్ పొన్నుసామి, డాక్టర్ రంగనాథన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య శర్మ సేవలు ప్రశంసనీయం

● వీడ్కోలు సభలో వక్తలు

ప్యారీస్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వేశాఖలో 40ఏళ్ళ సర్వీసులో కన్‌స్ట్రక్షన్ విభాగ అభివృద్ధికి సుబ్రహ్మణ్యశర్మ చేసిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. నాలుగు దశాబ్దాల పాటు రైల్వేలో సేవలందించి గురువారం పదవీవిరమణ చేసిన ఒ.సుబ్రహ్మణ్యశర్మను గురువారం ఘనంగా సత్కరించారు. ఎగ్మూర్‌లోని రైల్వే కన్‌స్ట్రక్షన్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన వీడ్కోలు సభలో దక్షిణ రైల్వే చీఫ్ పర్సనల్ ఆఫీసర్లు నారాయణన్, దినకరన్, జయరామన్, సీఈ (వెస్ట్) రవీంద్రసింగ్ రాజ్‌పాల్, ఎస్ఆర్ఎంయూ నాయకులు ఉన్నికృష్ణన్, వీరరాఘవన్, ఎస్ఆర్ఈఎస్ నేతలు గోపాలకృష్ణన్, రాజారామ్, హెచ్ఆర్ క్యాటరింగ్ సంతోష్, రైల్వే ఉద్యోగులు, కుటుంబసభ్యులు పాల్గొని శర్మను ఘనంగా సత్కరించారు. ఆయన సర్వీసులో పీసీటీవో, సీఏవో, ఎస్‌డీజీఎం, సీబీవో అవార్డులతో పాటు సమాజానికి అందిస్తున్న సేవలకు గాను పలు సంస్థలు ఉత్తమ సేవకుడి అవార్డుతో సత్కరించాయి. పదవీవిరమణ తర్వాత కూడా సుబ్రహ్మణ్యశర్మ సామాజిక, ఆధ్యాత్మిక రంగాలకు విస్తృత సేవలందించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఈ సభలో ఒ.సత్య వెంకట శేషసాయి. ఒ.లక్ష్మీనారాయణ, కేఏస్ఎన్. మూర్తి, గంటి శ్రీరామమూర్తి, ఎస్.శేషగిరిరావు దంపతులు తమ కుటుంబ సభ్యులతో పాటు హాజరై శర్మ సేవలను కొనియాడారు.



కుటుంబ సభ్యులు, రైల్వే ఉద్యోగులతో సుబ్రహ్మణ్య శర్మ



మెరీనా బీచ్‌లో అన్నాదురై సమాధి వద్దనున్న 'శిలప్పధికారం' రచయిత ఇళంగో అడిగళ్ జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు సామినాథన్, పీకే శేఖర్‌బాబు తదితరులు



2024 యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను రాజ్‌భవన్‌కు ఆహ్వానించి సత్కరించిన గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్రత్యక్ష విక్రయాల కేంద్రంగా చెన్నై

● ఎఫ్‌డీఎస్ఏ వెల్లడి

అడయార్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష విక్రయాలకు చెన్నై మహానగరం ప్రధాన కేంద్రంగా మారిందని 'ది ఫెడరేషన్ ఆఫ్ డైరెక్ట్ సెల్లింగ్ అసోసియేషన్' (ఎఫ్‌డీఎస్ఏ) వెల్లడించింది. అరుంబాక్కంలోని ఒక నక్షత్ర హోటల్‌లో ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్‌పై ఒకరోజు కార్యక్రమం జరిగింది. శాలిని విశ్వవిద్యాలయంతో కలిసి ఎఫ్‌డీఎస్ఏ ఈ సదస్సును నిర్వహించింది. ఇందులో సుమారు 300 మంది డైరెక్ట్ సెల్లర్లు (ప్రత్యక్ష విక్రయదారులు) పాల్గొన్నారు. 2011లో స్థాపించిన ఈ సంస్థలో 29 మంది యాక్టివ్ కంపెనీలు భాగస్వామిగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఎస్ఏ అధ్యక్షుడు ఏపీ రెడ్డి, ఉపాధ్యక్షులు రాజీవ్ గుప్తా, దేవ్ ఆనంద్, షోలిని యూనివర్శిటీ ప్రొఫెసర్ కమల్‌కాంత్ వశిష్ట్, ప్రొఫెసర థామస్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు. రూ.26 వేల కోట్ల ప్రత్యక్ష విక్రయాలు జరిపి తమిళనాడు ప్రముఖ పాత్రను పోషించిందని ఏపీ రెడ్డి వెల్లడించారు.



→ కార్యక్రమంలో ప్రముఖులు



చెన్నై కొట్టూపురంలోని బిర్లా ప్లానిటోరియంలో 'నీడ లేని రోజు'పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా విజేతలకు
బహుమతుల పంపిణీ

తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు కార్ అండ్ బైక్ రేసుకు సంబంధించి గత నెల 25వ తేదీన జరిగిన లక్కీ డ్రాలో విజేతలైన ముగ్గురికి గురువారం తిరుపతిలో బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి పొందిన తిరుపతి గోపాలరాజు కాలనీకి చెందిన డి.వత్సలకు ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచి మేనేజరు సురేష్‌రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి హీరో హోండా బైక్‌కు సంబంధించి చెక్ అందజేశారు. తిరుపతి కపిలతీర్థం రోడ్డుకు చెందిన మరుదాడ నగేష్‌కు ద్వితీయ బహుమతి కింద రెఫ్రిజిరేటర్.. పలమనేరు సెహ్రా నగర్‌కు చెందిన టి.కె.శశిధర్‌కు తృతీయ బహుమతి కింద టీవీ అందజేశారు.







ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద చెక్కు, రిఫ్రిజిరేటర్, టీవీ అందుకుంటున్న వత్సల, నగేష్, టి.కె.శశిధర్


సర్వదర్శనానికి 12 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంటన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.62 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,705

తలనీలాలు సమర్పించినవారు: 25,382





ఇలా సిద్ధమైతే... పాలిసెట్ విజేతలు మీరే



తిరుపతి(విద్య), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులపై ఆసక్తి పెరుగుతోంది. పదవ తరగతి తర్వాత ఎక్కువ మంది ఈ కోర్సుల్లో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎక్కువ మందికి ఉద్యోగ,ఉపాధి ఉపాధి అవకాశాలు లభించడమే ఇందుకు కారణం. జిల్లాలో 6 ప్రభుత్వ, 7 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ఎయిడెడ్ కళాశాల కూడా ఉంది. మొత్తం 3500 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుల ప్రవేశానికి ఈనెల 30న జరిగే పాలిసెట్ పరీక్షకు సిలబస్‌ను బాగా చదువుకుంటే విజేతగా నిలవడం సులభమేనంటున్నారు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్.వి. గౌరీశంకర్. రెండు గంటల్లో 120 ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయగలిగేలా టైం ప్లాన్ చేసుకోవాలంటున్నారు. పదవ తరగతి సిలబస్ నుంచి గణితంలో 50 మార్కులకు, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నాపత్రం ఉంటుంది. నెగెటివ్ మార్కులు ఉండవు. సబ్జెక్టుల వారీగా ఆయన సూచనలిలా..



డాక్టర్ **ఎస్.వి. గౌరీశంకర్,** జనరల్ సెక్షన్ హెడ్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి.

గణితం

త్రికోణమితి, నిరూపక రేఖా గణితం, సంభావ్యత, సంఖ్యాశాస్త్రం, పురోగతి, త్రిభుజాలు, వృత్తాలు, ద్విపద సిద్ధాంతం, మాత్రికలు, ఘతాంతక మరియు లాగరిథమిక్ సిరీస్, సమీకరణాల సిద్ధాంతం వంటి వాటిపై విద్యార్థులు పట్టు సాధించాలి. ఐదేళ్ల క్రితం నుంచి ఉన్న ప్రశ్నా పత్రాలను అభ్యాసం చేయగలిగితే మంచి మార్కులు పొందొచ్చు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో ప్రతి ఛాప్టర్ చివరిలోని ముఖ్యాంశాలను చదువుకోవాలి.

ఫిజిక్స్

ఆరు చాప్టర్లు ఉంటాయి. వేడి, సమతల ఉపరితలాలల వద్ద కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, వివిధ ఉపరితలాల ద్వారా కాంతి ప్రతిబింబం, మానవ కన్ను, రంగుల ప్రపంచం, విద్యుదయస్కాంతత్వం చాప్టర్లలో ఒక్కో ఛాప్టర్ నుంచి 8 నుంచి 10 ప్రశ్నల వరకు వచ్చే అవకాశం ఉంది.

కెమిస్ట్రీ


పదవ తరగతి కెమిస్ట్రీలో నాలుగు చాప్టర్లు ఉంటాయి. ఒక్కో చాప్టర్ నుంచి 7 నుంచి 8 ప్రశ్నలు వచ్చే అవకాశముంటుంది. మూలకాల వర్గీకరణ-ఆవర్తన పట్టిక, లోహశాస్త్రం సూత్రాలు, రసాయన ప్రతిచర్యలు, సమీకరణాలు, అణువుల నిర్మాణం, రసాయన బంధం, కార్బన్-సమ్మేళనాలు, ఆమ్లాలు, క్షారాలు,లవణాలు అంశాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ముందుగా కెమిస్ట్రీ ప్రశ్నలకు జవాబులు ఇస్తే సమయం కలిసి వస్తుంది.

మంచి భవిష్యత్తు



పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. కోర్సు పూర్తిచేసినవారు ఎంట్రన్స్ ర్యాంకుతో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కళాశాలల్లోని సహాయక కేంద్రాలలో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

- డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



కళాశాలల వివరాలు

- **తిరుపతి:** బయోమెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ (షుగర్ టెక్నాలజీ), కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఫార్మశీ (ఇంటర్ అర్హతతో).
- **చంద్రగిరి:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్
- **కిల్లాపట్టు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ ఇంజనీరింగ్.
- **సత్యవేడు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్.
- **గూడూరు:** మైనింగ్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్ టెక్నాలజీ. (ప్రత్యేక కళాశాల).
- **తిరుపతి టీటీడీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల:** కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీసతో పాటు కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మశీ (ఇంటర్ అర్హత) బ్రాంచిలున్నాయి.

టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



టీటీడీకి గురువారం ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందింది. మహారాష్ట్రకు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం రూ.1.40 లక్షల విలువైన బిగాస్ సీ12 మాక్స్ 3.0 అనే ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టీటీడీకి అందజేసింది. ముందుగా వాహనానికి శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ డిప్యూటీఈవో లోకనాథంకు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దుర్గేష్ గుప్తా వాహన తాళాన్ని అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డిప్యూటీ సీఎంకు సాదర వీడ్కోలు



రేణిగుంట, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తిరుపతి విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. పెహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావుకు గురువారం నివాళులర్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన సాయంత్రం 6.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకోగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఏఎస్పీ రవిమనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ సురేష్‌బాబు, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుత వీడ్కోలు పలికారు. ఆయన ప్రత్యేక విమానంలో విశాఖపట్నం వెళ్లారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ శ్రీకాళహస్తి న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు కోర్టు లైజనింగ్ అధికారి గోపాల్‌రాజు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఏర్పేడు మండలం చెల్లూరుకు చెందిన సుబ్బమ్మ, కుమారుడు జగ్గయ్యతో కలిసి నివాసం ఉండేది. ఆమె భర్త బాలసుబ్రహ్మణ్యం కుటుంబ కలహాలతో మునిలిపేడులో ఉంటున్నాడు. అనారోగ్యంతో ఆయన 2016లో మృతి చెందాడు. భర్త కర్మక్రియల కోసం కుమారుడితో కలిసి సుబ్బమ్మ అప్పట్లో మునిలిపేడుకు వెళ్లగా, ఇంటి స్థలం విషయమై వారిమధ్య విభేదాలు ఉండటంతో భర్త తరపు బంధువులు ఆమెను అడ్డుకుని వెళ్లగొట్టారు. ఆ తర్వాత 2017 ఏప్రిల్‌లో పోలీస్‌స్టేషన్ ఎదుట ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని నిరసన చేస్తున్న వారిపై లారీ దూసుకెళ్లిన ఘటనలో మృతిచెందిన వారిలో మునిలిపేడుకు చెందిన సుబ్బమ్మ దాయాదులైన బాబు, హరి ఉన్నారు. 2017 మే 11న మునిలిపేడులో దాయాదుల కర్మక్రియలకు సుబ్బమ్మ, జగ్గయ్య వెళ్లగా.. మళ్లీ భర్త తరపు బంధువులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. కొందరు పెద్దలు ఇరువర్గాలకు చెప్పారు. ఈ క్రమంలో బాలసుబ్రహ్మణ్యం సోదరి సుజాత బొడ్డులో కత్తి పెట్టుకుని వచ్చి వదిన సుబ్బమ్మను పొడవడంతో ఆమె కుప్పకూలారు. సుజాతకు భర్త వెంకటేష్, అత్త రాణెమ్మ సహకరించారు. ఆ తర్వాత జగ్గయ్యను కూడా పొడిచేందుకు ప్రయత్నించగా మిగతావారు అడ్డుకున్నారు. గాయపడిన సుబ్బమ్మను తిరుపతి రుయాకు తరలించగా అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. జగ్గయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ వెంకటరమణ హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏ1 సుజాత, ఏ2 రాణెమ్మ, ఏ3 వెంకటేష్‌ను అప్పట్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి న్యాయస్థానంలో విచారణఅనంతరం గురువారం 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ ముగ్గురు నిందితులకు యావజ్జీవశిక్షతో పాటు రూ.15వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు ఛేదనలో పీపీ వీరరాఘవరెడ్డి, కోర్టు మానటరింగ్ సీఐ వెంకటప్ప తదితరులు చొరవ చూపారు. చురుగ్గా వ్యవహరించిన ఏర్పేడు పోలీసు అధికారులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

రెవెన్యూ అధికారులు లంచం అడుగుతున్నారా?

- బోడిలింగాలపాడు గ్రామస్థులను అడిగిన కలెక్టర్



గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'రెవెన్యూ అధికారులు, సిబ్బంది మిమ్మల్ని లంచాలు అడుగుతున్నారా? లేకపోతే ఇబ్బందులు పెడుతున్నారా?' అని కలెక్టర్ వెంకటేశ్వర్ స్థానికులను ప్రశ్నించారు. తడ మండలం తడకండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడులో గురువారం పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. బోడిలింగాలపాడు జాతీయ రహదారి మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని దానిపై చర్యలు తీసుకోవాలని, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. నెల్లూరుజిల్లా జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫోన్‌చేసి ఆ మలుపును పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

రూ.25 కోట్లతో హాస్టళ్ల మరమ్మతులు

జిల్లాలో రూ.25 కోట్లతో సుమారు 110 హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తడలోని బీసీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. హాస్టళ్లలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.6 కోట్లను మంజూరు చేసిందని, అదనంగా కావాల్సిన సౌకర్యాల కోసం జిల్లాస్థాయిలోనే పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు, బీఎంఎస్, ఎంపీలాడ్స్ నుంచి రూ.25 కోట్లు సమకూర్చుకుని అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నామన్నారు. వీటిద్వారా ఆర్వో వాటర్, రూఫ్ ట్రీట్‌మెంట్, మరుగుదొడ్లు, పర్మినెంట్ వంటగది, దోమల తెరలతో కూడిన కిటికీలు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పనులన్నీ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో కిరణ్మయి, తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు శరత్‌బాబు, నరసింహారావు, ఎంపీడీవో విజయ్ కుమార్, సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తనల వైపు యువతను తీసుకెళ్లాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను యువతకు యూట్యూబ్ ద్వారా చేరువ చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పరిపాలనా భవనంలో గురువారం వివిధ విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఎస్వీబీసీ ద్వారా సంకీర్తనలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇందుకోసం నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలతో వేగవంతంగా సంకీర్తనలను యూట్యూబ్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతిలో జరుగుతున్న వివిధ ఇంజనీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వేసవి సందర్భంగా స్థానికాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా, రద్దీకనుగుణంగా చర్యలు చేపట్టాలని జేఈవోను ఆదేశించారు. అనంతరం తిరుపతిలోని ఆరోగ్య విభాగం, శ్వేత, టీటీడీ కొనుగోళ్ల విభాగం, స్విమ్స్, విద్య, వైద్యం తదితర విభాగాల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 22 మంది డిబార్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో చేపట్టిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల్లో 22 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. మదనపల్లె-16, చిత్తూరు-6 మంది మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విషయాన్ని గుర్తించి హైపవర్ కమిటీ డిబార్ చేసినట్టు పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

ఉగ్రవాదులే వస్తే..
తిరుమలలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



విశ్రాంతి భవనంలోకి వెళుతున్న ఉగ్రవాదులు



ఉగ్రవాదుల సమాచారమిస్తున్న విజిలెన్స్ వీజీవో

అది తిరుమల లేపాక్షి సర్కిల్ వద్దనున్న సుదర్శన్ విశ్రాంతి భవనం. గురువారం సాయంత్రం ముగ్గురు ఉగ్రవాదులు వాహనంలో వచ్చి పాకిస్థాన్ జిందాబాద్, జీహాద్ అంటూ కేకలు వేస్తూ వచ్చారు. విశ్రాంతి గృహ ప్రవేశం వద్ద ఇద్దరు సెక్యూరిటీ గార్డులను గాయపరిచారు. ఒక ఉగ్రవాది అంతస్థు పైభాగంలోకి.. మరొకరు ఓ గదిలోకి.. ఇంకొకరు భవనం ప్రవేశంలోకి చేరారు. విజిలెన్స్ సిబ్బంది సమాచారంతో వీజీవో, స్థానిక పోలీసు అధికారులతో పాటు ఓ కమెండో ఆధ్వర్యంలో 29 మంది ఆక్టోపస్ సిబ్బంది లేపాక్షి సర్కిల్‌కు చేరుకున్నారు. భవనం మ్యాప్‌ను పరిశీలించారు. మూడు బృందాలుగా విడిపోయారు. భవనం ప్రవేశంలో ఉన్న ఓ ఉగ్రవాదిని అసాల్ట్ డాగ్ ఎనిమీ విధానంలో హతమార్చారు. ఆ తర్వాత భవనంలోకి వెళ్లి, ఓ గదిలో దాక్కున్న ఉగ్రవాదిని, ఆ తర్వాత భవనంపై ఉన్న మరో ఉగ్రవాదిని హతమార్చారు. అప్పటికే విశ్రాంతి భవనం వద్దకు చేరుకున్న వైద్య సిబ్బంది ఉగ్రవాదుల దాడిలో గాయపడిన భక్తుడు, సిబ్బందికి చికిత్స అందజేసి ఆస్పత్రికి తరలించారు. ఇక, ఫైర్ సిబ్బంది కూడా ఉగ్రవాదులు ద్వారా తలెత్తిన మంటలను అదుపుచేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




విశ్రాంతి భవనంలోకి ప్రవేశిస్తున్న అక్టోపస్ సిబ్బంది - రూమ్ ఇన్టర్వెన్షన్ విధానంలో మరో ఉగ్రవాదిని అదుపులోకి తీసుకున్న అక్టోపస్ సిబ్బంది

- పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో ఆక్టోసప్ బృందం ఇలా దాదాపు ఒకటిన్నర గంట పాటు జరిపిన మాక్‌డ్రిల్ ఇది. భక్తులు బస చేసే అతిథిగృహంలోకి ఉగ్రవాదులే వస్తే ఎలా స్పందించాలనే దానిపై మాక్ డ్రిల్ జరిగింది. దాదాపు 30 మంది అక్టోపస్ సిబ్బంది, 25 మంది విజిలెన్స్, 15 మంది పోలీసులు, 10 మంది ఏపీ ఎస్పీ సిబ్బంది డ్రిల్‌లో పాల్గొన్నారు.



గాయపడిన భక్తుడిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది






విశ్రాంతి భవనం ముందున్న ఉగ్రవాదిని అసాల్ట్ డాగ్ ఎనిమీ విధానంలో హతమారుస్తున్న సిబ్బంది - విశ్రాంతి భవనం పైభాగంలో మరో బృందం - ఉగ్రవాదిని హతమార్చుతున్న సిబ్బంది